

# మంత్రం

"పంతులున్నాడు బాంచెను"

"ఉన్నడు, పూజమీదున్నడు. జర జైసు ఒస్తడు"

"ఉంటడో లేదో అన్కుంట ఆదరి వాదల ఒస్తాన. అమ్మయ్యా బత్కిన. గామొన్న ఒస్తె లేకుండె యాదగిరి గుట్టకు బొయిండె. మల్ల మొన్న నాల్గొద్దుల కింద ఒచ్చినప్పుడు గూడ లేడు. పేటకు బోయిండంటన్నరు. మరి ఇయ్యాలన్న ఉన్నడో లేదో నన్కుంట ఒస్తాన."– ఎగబోసుకుంట జెప్తాంది సుక్కమ్మ. సంకల బిడ్డనెత్తుకొని ఉన్నది అది నల్లగ, బక్కగ ఎండిపోయిన శింతపండోలె ఉన్నది. సుక్కమ్మ నల్పుగాదు ఎర్పుగాదు గని శామనశాయ రంగుంటది కరువో కాటకమో గని ఒయసుల్నే ముసలి మొకం బడ్డది.

మొదట్ల పంతులిల్లు గూనపెంకలది వుండె. తీసేసి ముంగట డాబ గట్టిండు. బంగ్లకు మంచి రంగులేపిచ్చిండు పట్నం లస్కర్ల గట్టినట్టు గట్టిపిచ్చిండు. ఆకిట్ల శెట్లు గూడ పెట్టిపిచ్చిండు.

పంతులు ఇల్లు గడ్తాండని ఊల్లె అందరు అనుకున్నరు గని తనే ఎప్పుడు గింతదూరం రాలె. అదంత సుక్కమ్మకు కొత్త కొత్తగ అనిపిస్తాంది. యింటి పని మొదలైన రోజు కూలికని ఒస్తె "నువ్వెందు కొచ్చినవే? అంత ముట్టుడయిపోతది ఫో ఫో మాకు యింట్ల గల్సిన కూలోల్లు గావాలె''- అంటని ఎల్లగొట్టిండె గైతె. ఇగ మల్ల ఇటు రాలె

''ఎవల్కి నీ బిడ్డకు బాగలేదా? '- అంటడిగిండు సోములు.

''అవ్ అయ్యా. పొల్లకే బాగలేదు, రోజు రోజుకు ఎండ్కపోతాంది. డాక్టరు తానికి పోతే సూదులిప్పియ్యాలె. మందు దినాలె అంటున్నడు గని, పైసలాన్నించి దేవాలె గులాపుదాన్ని- ఇగ గీ పంతులు శెయ్యి మంచిది. తాయిత గట్టి మంత్రమెయ్యంగనె జప్పున బాగయితదంట, మా అసోంటి పేదొల్ల దగ్గర ఏమీ దీస్కోకుంట ఉత్తగనె గడ్తాండని మొన్న మా వాడ కొచ్చినప్పుడు నువ్వే జెప్తివి. ఎవ్వల్కి ఏమైనా గని గీ పంతుయి తానికి దీస్కొస్తె బాగయితదంటివి. గన్క ఇగ నీ మాట మీద ఒస్తానగాదూ"

''ఒ ఇగ జెప్పేదున్నాది. ఎక్కడెక్కడి రాజ్యం నుంచి ఒచ్చి తాయిత గట్టిచ్చుక పోతరుగాదు! పొద్దున్నాక, తెల్లన్దాక యిరాం ఉండదు. పూజల్జేసుడు, సాంతిజేసుడు, తాయితలు గట్టుడు కని ఒక్కటి- ఎట్లెట్ల కట్టిచ్కపోతాంద్రో అట్లట్ల బాగయితాంద్రు. ధర్మం గల్ల శెయ్యి మంత్రం ఎయ్యంగనె పార్తది. పారంగనె నయమైతది. యిన్నేండ్ల సంది ఈడ పంతులు తాన జీతముండి సూత్తానగద! ఈ పొద్దుదాక అయ్య, నీ మంత్రం పన్జెయ్యలె అంటని ఒచ్చినోల్లు లేరు. నేను కుద్దుజూస్తాన గద ఈడ''- అని శెప్తనే వుండు సోములు.

సుక్కమ్మకు జెర్ర మన్సు కుదురుకున్నది. ఏదో మందో మంత్రమో ఏదైతేంది? బిడ్డ బాగ్గావాలె గంతె- 'పంతులు తానికిపోయి

మంత్రమేయించ్కొస్త' అంటే ఎందుకో గని పెన్మిట్కొద్దన్నడు. 'రెండు దినాలాగు మొన్న గా రాజలింగం పొలంల శెట్టగొట్టిన బాపతు కూల్లు వడేదున్నది. పెద్ద డాక్టరు తాన ఇంజీసన్లిప్పిద్దాం అంటున్నడు గని' ఏమో గా పైసలొస్తే గిన్ని తిండి గింజలు కొనుక్కోవచ్చు. గీ మంతం తోటి పొల్ల రోగం కర్సు లేకుంట బాగయితదేమో అనిపిచ్చింది.

రొండు మెట్లెక్కి మూడో మెట్టమీద కూసుంది. మందటి సాయ బాన్ల సానలు, కల్వాలు కనబడ్డయి ఆటి మీద నూరి పెట్టిన ముద్దలు, నున్నగ, ఎర్రగ పచ్చగ ...నల్లగ రంగు రంగుల మందులు, పక్కకే బల్లెపీట మీద ఆకులు, శెట్ల యేర్లు, ఇంకేంటియో పొట్లాలు, భస్మాలు, శాన వున్నయి. అమ్మో! పంతులెన్ని పనులెజ్జెస్తడు?మంత్రా లేసుకుంట వైద్యం చేసుకుంట, మీదినించి సర్కారి కొలువు గూడ జేస్తడు. అనుకుంటుండంగనె ఎవరో ఒకాయన ఓ శేత్ల కోడిపెట్ట,ఓ శేత్ల కల్లుకుండ పటోక్కనొచ్చి దడ్డి దర్వాజ ఎంబడి లోపల్కిబోయిండు

"అగో సూశినావ్ సుక్కమ్మ గాయ్నెవలను కున్నావ్? గా ముత్తిరెడ్డి గూడెం ఆసామి! పెండ్లాన్కి తాయిత గట్టించెటందుకు ఒచ్చిండు—" సోములు జెప్పిండు. మరి గా కోడి పిల్లలెందుకో సుక్కమ్మకు దెల్వలే.

ఇంతలకు పంతు లొచ్చిండు.

తమలపాకు నములుకుంట, జందెం తోటి ఈపు రాసుకుంట..... గప్పుడే బోంచేసి బయిటికొస్తున్నట్టున్నది

"ఏంది బిడ్డ ఏంగావాల్నె"—అంటని అడిగి దెల్సుకోని, పొల్ల పెయ్యి జూశి చెప్పిండు-"పోరికేం గాదు. జెర సాంతి జెయ్యాలె. పోతది. ఏదో గాలి సోకింది. సూడు పానాలు కండ్లల్ల కొచ్చినయి.

రేపురా తాయిత గడ్త. ఆరం గూడ మంచిగున్నది. సుక్రారం గాలిగ గడితె మంచి గుంటది. గా సామాన్లు దీస్కోని రేపు గియాల్లకు రాపో"

"సామాన్లేం దేవాలె? బత్కలేద్దాన్ని ఏం దీస్కోక మంత్రమేసి తాయిత గడ్తడని మొన్న గీ సోములన్న అందరికి శెప్పినట్టు నాకు జెప్పె ఒస్తి"

పంతులు లేత శింతకాయ పులుపోలె నగిండు. నగి అన్నడు—
"పున్యానికి గాకపోతె నాకేమన్న ఇయ్యమంటున్నానె పిచ్చిదాన మీ దగ్గర దీస్కుంటె నాకేమన్నుంటదా? మీ నోటికాడి బుక్క గుంజుకుంటాను బిడ్డ? యంత్రం రాసి మంత్రమేశి నందుకు నాకేమియ్యకు. గని కోడిపిల్ల పోశమ్మకు పారమియ్యాల్నాయె కల్లు కట్టమైసమ్మకు దారబొయ్యాల్నాయె. ఊదు పొగకు ఓ అయిదు రూపాయలయితయి తప్పుతదాశెప్పు మరి మంత్రం బారాల్నటె ఎప్పటోలె ఇవ్వన్ని జెయ్యొద్దా ? నువ్వే జెప్పు. గా యంత్రంరాశిన కాయితానికి రాగిడబ్బ తొడ్గాల్నాయె! అవుసలోడు ఉత్తగ జేస్తడ? ఆనికింతో అంతో ఇయ్యాలె గద—" అడిగిండు పంతులు. సన్నశీపురు పుల్లతోటి పండ్ల సందులు సాపు జేసుకుంటన్నడు. పండ్లల్ల యిరికిన కోడి మాంసం పిసర్లు...... ఓ మూలకు 'తుఫ్' మంటాండు.

సుక్కమ్మ ఏంజెప్పలే.

అంటన్నిటికీ ముప్పయి, నల్బయి రూపాయ లయ్యేటట్టున్నయ్, మందు కొనుక్కుడి నయముండె గద. లోపలబొయి పన్జేసి తాఖతు యిస్తది. గీ మంత్రాలు గాలిసోకిందంటని బత్కులు గుల్ల జెశెటట్టున్నయ్. గీ పంతులు పొలాలు గొన్నది కోల్లపారాలు జెట్టేది యెట్లనో

జెర్ర జెర్ర దెల్సినట్లనిపించింది. దినాలు గిట్ల ఎల్లదీశి సర్కారిజీతం అనామతు జమజేస్తాండు గావొచ్చు. తాయిత ఉత్తగ గడ్తంటని పిలి పిచ్చుకోని యిట్ల రోజుకు ఎందరికి శాంతి జేస్తాండో......... ఎందరి అమాయకపు నోర్లకు తాయితలు గడ్తాండో అనుకుంటున్న సుక్కమ్మకు యేమేమో గన్పిచ్చినయ్—తన పెన్మిటి దుడ్డుకర్ర బట్కోని ఒస్తున్నట్టు ......అయనెనక గూడెం లున్న ఒయిసోల్లందరు కట్టెల్దిప్పుకుంట ఒస్తున్నట్టు.........యిటే ఒస్తున్నట్టు......అన్నాయంగ ఊల్లె ఒగన్కి విషమ్మందు బెట్టేందుకు పైసల్దీస్కోని కుట్రకేసుల పాలుపంచుకున్నందుకు శేతులకు బేడీలేస్కోని పంతులు పోతున్నట్టు కండ్లల్ల దిరిగింది... ...తెలివొచ్చినట్టయింది. నరాలన్ని మెలిదిరిగి నట్టయినయి. సంకల బిడ్డ జారిపోతె, కోపం తోటి ఎగేసుకుంది.

ఆ పిల్ల కండ్ల ఊసులు...ముక్కు చీమిడి...నోట్ల నుంచి సొల్లు ...అంత గలీజు! అల్ల బత్కోలె. ఈగలన్ని గుప్పున ఆల్తానయి ఏడ్మెటందుకన్న శేతగాక మూల్గుతాంది పిల్ల.

కన్నీల్లను మింగిన సుక్కమ్మ కండ్లు ఎర్రెర్రగ అగుడు సురూ జేశినయి. గిరుక్కున ఎన్కకు దిరిగింది. పిచ్చి నమ్మకాల నించి—

పంతులు. సోములు అసోంటోల్లు ఎంత మందో భస్మమయ్యేటట్టు సుక్కమ్మ వొల్లంత భగ్గున మండింది.

జయశ్రీ
రిపబ్లిక్‌డే ప్రత్యేక సంచిక
1975

...o...